స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 15 ఫిబ్రవరి 2025 | 5

ర్యాంకు ఎంత..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు మూడో ర్యాంకు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని రాజధానిలో శుక్రవారం స్వయంగా ప్రకటించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కోసం ప్రత్యేక కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాకు మూడో ర్యాంకు లభించడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మిషన్‌లో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖ 14 ఇండికేటర్స్‌తో పెట్టుకున్న లక్ష్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు అందజేశారు. అందులో పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15

ర్యాంకు : 3 | పాయింట్లు 125/200

'తూర్పు'లో భేష్!

జిల్లా కలెక్టర్ ప్రశాంతి కృషికి ఫలితం

పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లకు 10, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణకు 10, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజీకి 20 పాట్లు వంతున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లా ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. అందులో 125 పాయింట్లతో జిల్లాకు 3వ ర్యాంకు లభించింది. జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి జిల్లాకు మూడో ర్యాంకు లభించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని 299 గ్రామాల్లో ప్రతీరోజూ పారిశుధ్యం, నీటి సరఫరా తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో 299 గ్రామాలకుగానూ 268 చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులు జరుగుతున్నాయని, కొన్ని షెడ్లకు సమస్య ఉన్నా, వాటి పరిష్కారానికి దృష్టి పెట్టామని చెప్పారు.

ర్యాంకు : 14 | పాయింట్లు 109/200

కాకినాడకు నిరాశ!

కాకినాడ /కాకినాడ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల ర్యాకింగ్‌లో కాకినాడ వెనుకబడింది. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడంలో మంచిపని తీరు కనబరచలేక 14వ ర్యాంకులో నిలిచింది. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలు కలిపి వివిధ అంశాలపై మొత్తం 14 విభాగాల్లో రేటింగ్ ఇవ్వగా 200 పాయింట్లకుగాను 109 పాయింట్లు మాత్రమే సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తోంది. ఇదిలా ఉండగా ఈనెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోర్స్ రీసోర్స్ అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా మన మూలాలు- మన బలాలు తెలుసుకుని రాష్ట్రంలోని వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికింద జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు పర్యావరణాన్ని తీసుకురావడం, సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం వంటి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

ర్యాంకు : 17 | పాయింట్లు 105/200

కోనసీమ వెనకడుగు

అమలాపురం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 17వ స్థానంలో నిలిచి ర్యాంకుల సాధనలో వెనకబడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల్లో కోనసీమ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 105 పాయింట్లతో సరిపెట్టుకుంది. జిల్లాలకు 14 ఇండికేటర్స్‌ను పెట్టుకుని వాటిలో అంశాల సాధనలో ముందంజలో ఉన్న జిల్లాలవారీగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ముఖ్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు సమీక్షించారు. ప్రతీ నెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతీ నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా, ఫిబ్రవరిలో సోర్స్ రిసోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. జిల్లా వెనుకబడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ర్యాంకు : 25 | పాయింట్లు 81/200

అల్లూరి జిల్లాలో అధ్వానం!

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషనలో భాగంగా ప్రకటించిన ర్యాంకుల్లో చిట్టచివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలవడంతో జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. జిల్లా ప్రగతిపై సంబంధిత అధికారులు సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 81 పాయింట్లతో చివరి 25 స్థానం పొందింది. రాష్ట్రంలో మొదటి స్థానాన్ని 200 పాయింట్లకుగాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా నిలిచింది.

పంటబోదెలా మారిన పేరాయిచెరువు ప్రధాన పంటకాల్వ





గోపవరం, సరిపల్లి, చల్లపల్లి ప్రాంతాల్లో అమలాపురం-ఎస్.యానాం ప్రధాన పంటకాల్వ గుర్రపుడెక్కతో నిండిన దృశ్యం



వాడపర్రు పంటకాల్వ ఆయకట్టులో నీరు తోడుకుంటున్న దృశ్యం

వంతు రోజున అదే తంతు..

- పొలాలకు అందని సాగునీరు
- మూసుకుపోయిన పంటకాల్వలు
- నాట్లు వేసి నీటి కోసం నానా తిప్పలు

వర్షాలు, ముంపుతో దాళ్వా నాట్లు జాప్యమయ్యాయి. ఇప్పుడు ఆ నాట్లు సాగునీటి కోసం వెంపర్లాడుతున్నాయి. ఎండలు ముదురుతున్నాయి. పంటకాల్వలు నానాటికీ అడుగంటుతున్నాయి. ప్రస్తుతం దాళ్వా పైరు పరిస్థితి ఇది.

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఈ పరిస్థితిని అధిగమించేందుకు సాగునీటి సరఫరాలో వంతుల వారీ విధానం అమలు చేస్తున్నారు. వంతు రోజుల్లో ఆయా పంట కాల్వల్లో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉంటుంది. దీంతో శివారు పొలాలకు సైతం నీరందుతుంది. ఇది జరగాలంటే పంట కాల్వల్లో నీటి ప్రవాహం సజావుగా ఉండాలి. అలా ఉండాలంటే పంటకాల్వల్లో తూడు, గుర్రపుడెక్క లేకుండా పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడే ఎగువ నుంచి వచ్చే నీరు ఒక క్రమ పద్ధతిలో శివారుకు చేరుతుంది. కాని పరిస్థితి ఇప్పుడలా లేదు. అమలాపురం, అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ల పరిధిలో పంటకాల్వలు తూడు, గుర్రపుడెక్కలతో మూసుకుపోయాయి. దీంతో వంతు రోజున సైతం పంటచేలకు నీరందడం లేదు. అమలాపురం- ఎస్.యానాం ప్రధాన పంటకాల్వ గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలతో పూడుకుపోవడంతో గోపవరం, సరిపల్లి, చల్లపల్లి, ఎస్.యానాం ప్రాంతాల పొలాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. అయినాపురం సెక్షన్ పరిధిలో లక్ష్మివాడ-వాడపర్రు, అయినాపురం- పేరాయిచెరువు ప్రధాన పంటకాల్వలు ఆక్రమణలు, వ్యర్థాలతో కుంచించుకుపోవడంతో నీటి ప్రవాహ వేగం తగ్గి శివారు రైతులు సాగునీటి కోసం అగచాట్లు పడుతున్నారు. వంతు రోజు కోసం ఎదురుచూసి చేనుకు తడి అందించలేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఈ సమస్యను పరిష్కరించకుంటే ముందు ముందు శివారు పొలాలకు ముప్పు తప్పదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రతి రైతుకు

విశిష్ట గుర్తింపు సంఖ్య



వ్యవసాయ సేవలు సులభతరం చేసేందుకు కొత్త విధానం



విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

ఐ.పోలవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు వ్యవసాయ సేవలను సులభతరం చేసి మరింత పారదర్శకంగా అందించేందుకు ప్రతి రైతుకూప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అందుబాటులోకి తీసుకురానున్నారు. రైతు సంక్షేమశాఖ, భారతప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం ఇది. దీని ద్వారా 11అంకెలతో రైతు గుర్తింపు సంఖ్యను ఏర్పాటు చేసి, తద్వారా ప్రభుత్వ సేవలను అందించడం జరుగుతుంది. రైతు భూవివరాలను రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ సంఖ్య ఆధారంగానే వ్యవసాయ సంబంధిత సేవలు అందుతాయి. ప్రభుత్వం నుంచి అందే వివిధ రాయితీలు, బీమా వంటి ప్రయోజనాలు పొందవచ్చు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ,పంటలబీమా, పంటరుణాలపై వడ్డీరాయితీ, రాయితీపై యంత్రపరికరాలు, సూక్ష్మ పోషకాలు, పెట్టుబడి సాయం, పంట రుణాలు, ఈ -పంట నమోదు తదితర పథకాలు పొందవచ్చు. నీటి పారుదల, తెగుళ్ళ నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు పొందవచ్చు.


నమోదు విధానం ఇలా..

రైతు ఆధార్ నెంబర్..ఆధార్ అనుసంధానిత ఫోన్ నెంబరు, కొత్త పట్టాదార్ పాస్‌బుక్ తీసుకుని గ్రామంలోని రైతు కేంద్రాన్నిర సంప్రదించి గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి.

విరామంతో

ఉపశమనం

- టెన్త్‌లో పరీక్ష పరీక్షకు మధ్య గ్యాప్
- ఒత్తిడి నుంచి బయటపడేసేందుకు నిర్ణయం



కొత్తపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థుల్లో తెలియని ఒత్తిడి ఆందోళన క్రమేపీ పెరుగుతోంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో పగలు, రాత్రి చదువుతారు. కొందరు పరీక్షల సమయానికి చదివిన వాటిలో కొన్ని మరిచిపోతుంటారు. ఈ కారణంగా ఆశించిన స్థాయిలో మార్కులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడతారు. ఇంకొందరు అయితే ఆహారంపై దృష్టి సారించక చదువుతో నీరసించిపోతారు. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం పది పరీక్షల నిర్వహణపై దృష్టిపెట్టి విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేలా ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు విరామం వచ్చేలా టైమ్ టేబుల్ ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 237 ఉన్నత పాఠశాలకు గాను సుమారు 19,200 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. గతంలో పది పరీక్షలను రోజుకు ఒకటి చొప్పున నిర్వహించడం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురయ్యేవారు. పండుగ, వారాంతపు సెలవులు వస్తే తప్ప విరామం వచ్చేది కాదు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా పాఠ్యాంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి 100 మార్కులకు గాను ఒకే పేపరు విధానంతో పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థుల్లో మరింత భారం పెంచినట్లయ్యింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చే నెల మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి పరీక్ష మధ్య ప్రభుత్వం ఒక రోజు విరామం ప్రకటించగా గణితం, సాంఘిక శాస్త్రం పరీక్షలకు అదనంగా మరో రోజు విరామం వచ్చింది.

విరామం రావడం విద్యార్థులకు మేలు...



టెన్త్ పరీక్షల్లో పరీక్ష పరీక్షకు మధ్య ఒక్కరోజు విరామం రావడం ఇదే తొలి సారి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. దీంతో ఉత్తీర్ణత శాతం పెరగడంతో పాటు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఒక్కరోజు విరామం నిర్ణయం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది.

- షేక్ సలీంబాషా, డీఈవో, అమలాపురం

దామోదరం సంజీవయ్యను

ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి

జేసీ నిషాంతి



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్యను ప్రతీ ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా పనిచేయడంతో పాటు 38 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. వివిధ శాఖల్లో మంత్రిగా పనిచేసిన గొప్ప రాజకీయవేత్త మాత్రమే కాకుండా సాహితీవేత్తగా ఆయన చిరస్మరణీయుడని కొనియాడారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి జేసీ నిషాంతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నిరుపేద కుటుంబంలో పుట్టిన సంజీవయ్య పట్టుదలే పెట్టుబడిగా లా డిగ్రీని సాధించారన్నారు. తెలుగుభాషకు ప్రాచుర్యం తీసుకురావడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి, రాష్ట్రంలో భూ సంస్కరణలు తీసుకువచ్చిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గాల్లో పనిచేసిన సంజీవయ్య స్మారకార్థం పాటిగడ్డ సమీపాన ఉద్యాన పార్కును అభివృద్ధి చేసి ఆయన పేరు పెట్టారన్నారు. విశాఖపట్నంలోని లా యూనివర్సిటీకి 2012లో దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీగా నామకరణం చేసినట్టు జేసీ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, రమణకుమారి, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ అప్‌డేట్ తప్పనిసరి



సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్

అమలాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాల లబ్ధిని నిర్విరామంగా పొందేందుకు ప్రతీ ఒక్కరు ఆధార్ నమోదు, బయోమెట్రిక్ ఈకేవైసీ అప్‌డేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆధార్ నమోదు, అప్‌డేషన్ వంటి అంశాల్లో సమస్యల పరిష్కారానికి ప్రతీ మూడు నెలలకు ఒకసారి వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలందరికీ చైల్డ్ ఆధార్‌ను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జనన ధ్రువపత్రాలు పొందుతూ వాటి ఆధారంగా నమోదు చేయించుకోవాలన్నారు. ఐదేళ్ల పైబడి ఏడేళ్లలోపు వయసు ఉన్నవారు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవాలన్నారు. జిల్లాలో ఏడు నుంచి 17ఏళ్ల మధ్య వయసు గల బాలబాలికలు లక్ష మంది వరకు ఉన్నారని, వీరందరూ తప్పనిసరిగా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ కేంద్రాలను ఆశ్రయించి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవాలని లేనిపక్షంలో పాస్‌పోర్టు, ఉపకార వేతనాలు, ప్రభుత్వ రాయితీలు పొందడంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని స్పష్టం చేశారు. సున్నా నుంచి ఆరేళ్ల వరకు బయోమెట్రిక్ లేకుండా చైల్డ్ ఆధార్, ఏడేళ్ల పైబడిన వారికి బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ జారీ చేయనున్నట్లు చెప్పారు. భారత విశిష్ట గుర్తింపు పొందిన ప్రాధికార సంస్థ సహాయ మేనేజర్ గిరిధర్ మాట్లాడుతూ జిల్లాలో జీఎస్‌డబ్ల్యూఎస్, కామన్ సర్వీస్ సెంటర్, పోస్టర్ అధికారులు, లీడ్ బ్యాంకుల ప్రతినిధులకు ఆధార్ నమోదు, అప్‌డేషన్‌లో ఉత్పన్నమవుతున్న సాంకేతిక సమస్యలను, సందేహాలను నివృత్తి చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. వయోవృద్ధుల చేతి వేలిముద్రల బయోమెట్రిక్ నమోదు కాని పక్షంలో పెన్షన్, రేషన్ పొందడానికి వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను యూఐడీఏఐ చేస్తుందన్నారు. సమావేశంలో ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, దేవరకొండ అఖిల, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, లీడ్ బ్యాంకు మేనేజర్ కేశవవర్మ, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఎస్.త్రినాథరావు, జిల్లా కోఆర్డినేటర్ సువిజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హాకీ టోర్నమెంట్

- కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- అతిపెద్ద క్రీడా సంబరానికి సర్వం సిద్ధం
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43టీంలు
- వెయ్యిమంది క్రీడాకారులు, వందమంది కోచ్‌లు రాక
- క్రీడాకారులతో నిండిపోయిన కాకినాడలోని హోటళ్లు
- నేటినుంచి 28 వరకు రెండు వారాలపాటు క్రీడా సంబరాలు
- అతిథులుగా రానున్న అర్జున, ఖేల్ రత్న అవార్డు గ్రహీతలు

6



కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో హాకీ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్న క్రీడాకారులు

జీబీఎస్.. బీ అలెర్ట్

- రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్
- కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసులు నమోదు



జీబీఎస్(గులియన్ బర్రే సిండ్రోమ్).. అనేది ఓ అరుదైన న్యూరో వ్యాధి.. లక్షల్లో ఒకరికి కనిపిస్తుంది. ఈ వ్యాధి బారిన పడినవారికి కండరాలు బలహీనమవుతాయి. నాడీ వ్యవస్థ మీద ఇది ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ జీజీహెచ్‌లో తాజాగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇది ప్రాణాంతకం కాదని, సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెప్పున్నారు.

6

వైభవంగా పుష్పోత్సవం

ద్రాక్షారామలో భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు

6లో

నరసన్న ఆదాయం రూ.47,89,784

అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆదాయం లెక్కింపు

7లో



పిఠాపురం బైపాస్‌లో దట్టంగా అలముకున్న పొగ మంచు (పైన)
పిఠాపురం-గొల్లప్రోలు మధ్య 216 జాతీయ రహదారిపై పొగ మంచు (కింద)



- ఉదయం 9 గంటల వరకు తగ్గని ప్రభావం
- సాయంత్రం 4 గంటల నుంచే మరలా మొదలు
- దట్టంగా అలముకుంటున్న పొగ మంచు
- పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగినా తగ్గని చలి తీవ్రత


ఎండ తీవ్రత గణనీయంగా పెరుగుతున్నా, పొగ మంచు ప్రభావం తగ్గకపోగా రోజు రోజుకీ అధికమవుతోంది. రహదారులు, పొలాలపై మంచు దుప్పటి మాదిరిగా పరచుకోవడంతో పాటు తెల్లవారుజాము సమయాల్లో రోడ్లు కనిపించని పరిస్థితి నెలకొంది.

పొగ మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో భిన్నమైన పరిస్థితులతో పొగ మంచు ప్రభావం ఎక్కువైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు కాకినాడ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రాత్రి, పగటి వేళల్లో మంచు కురుస్తోంది. కొన్ని రోజులుగా ఉదయం 9 గంటలు దాటినా మంచు ప్రభావం తగ్గట్లేదు. సాయంత్రం నాలుగు గంటలకే మంచు కురవడం ప్రారంభమవుతోంది. బుధ, గురువారాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని ప్రాంతాల్లోనూ రహదారులు, పంట పొలాలు, నివాస ప్రాంతాలను పొగ మంచు ఆవరించింది. గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదైంది. వేడి, ఉక్కపోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. తెల్లవారుజామున 3 గంటలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19-20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అర్ధరాత్రి దాటాక పొగ మంచు ప్రభావంతో రహదారులు కనిపించట్లేదు. 16, 216 జాతీయ రహదారులు, ఇతర రాష్ట్ర రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలుచోట్ల వాహనాలను రోడ్డుపక్కన నిలిపివేసి వెలుతురు వచ్చిన తర్వాత తిరిగి ప్రయాణాలు సాగిస్తున్నారు. భిన్నమైన వాతావరణంతో చిన్నారులు, పెద్దల్లో జ్వరాలు, రొంప, దగ్గు, గొంతునొప్పి, వంటి నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని వైద్యులు చెప్తున్నారు.



గొల్లప్రోలు-పిఠాపురం మధ్య వరి పొలాలను ఆవరించిన పొగ మంచు



జీ బీ ఎస్ బీ అలెర్ట్

రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్

కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసుల నమోదు



జీజీహెచ్ (కాకినాడ), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): వైరస్ వల్ల వ్యాప్తి చెందే ఈ గులియన్ బర్రె సిండ్రోమ్ (జీబీఎస్)లో చాలా రకాలుంటాయి. ప్రథమంగా యాగ్జోనల్ వేరియంట్, డిమైనలేటింగ్ వేరియంట్ అనే రెండు రకాలుంటాయి. ఇవి వెన్నుపూస దగ్గర నుంచి కాళ్లు, చేతులు, మెడ, తలకు వెళ్లే నరాలకు వ్యాపిస్తాయి. ఇది వైరల్ జ్వరం ద్వారా వచ్చే దగ్గు, జలుబు లేదా తీవ్రమైన వాంతులు, విరోచనాలు తగ్గాక సంబంధిత వైరస్‌కు గానీ లేదా బ్యాక్టీరియాకు గానీ రక్షణ కోసం వచ్చిన కొన్ని యాంటీ బాడీస్ నరాలపై వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. తద్వారా నరాలు చచ్చుబడిపోతాయి. సహజంగా వైరల్ ఫీవర్ వచ్చాక మైకో ప్లాస్మా న్యుమోనియా అనేది రావడం సహజం. అది తగ్గాక వారం, రెండు వారాల్లో నరాలు చచ్చుబడిపోవడానికి అవకాశాలు ఎక్కువ లేదంటే క్యాంపలో బ్యాక్టర్ బ్యాక్టీరియా అంటే తీవ్రమైన వాంతులు, విరోచనాలు అయ్యాక రెండు వారాలు గడిచాక జీబీ సిండ్రోమ్‌గా రూపాంతరం చెందుతుంది.

లక్షణాలు: మొదట కాళ్ల వద్ద తిమ్మిర్లు ప్రారంభమై అవి చేతులదాకా పాకి పట్టు తప్పుతాయి. వణుకు ఎక్కువై మల, మూత్రాలు మందమవుతాయి. అలసట ఎక్కువగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, గుండె చప్పుడుల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. వేసుకున్న చెప్పులు మనకు తెలియకుండానే జారిపోవడం, కింద కూర్చుని లేవలేకపోవడం. కొంతమంది మెడ నిలబెట్టలేకపోవడం, మింగలేకపోవడం, శ్వాస అందకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస కోసం పనిచేసే కండరాలు కూడా ప్రభావితమవుతాయి. ఈ వ్యాధి నాలుగు వారాలు వరకు పెరగవచ్చు లేదా ఐదు రోజుల్లోనే ఎక్కువ కావచ్చు. మరికొంతమందికి వారం, పది రోజుల వరకు పెరిగి ఆగిపోతుంది. కొంతమందికి కాళ్లు పట్టు మాత్రమే వదులుతాయి. మరి కొంతమందికి కాళ్లు, చేతులు కూడా వదులుతాయి. ఇంకొంతమందికి మెడ వాలిపోతుంది. తద్వారా ఆయాసం తీవ్రమై వెంటిలేటర్ పైకి వెళ్లే అవకాశముంది. ఈ వ్యాధి కేవలం నాలుగు వారాల వరకే పెరుగుతుంది. ఆఒక్కోసారి ప్రాణాపాయంలోకి వెళ్లకుండా చికిత్స లేకుండానే బాధితులు కోలుకుంటారు. అయితే కోలుకున్న అనంతరం ఏదో ఒక అవుకుతనంతో బాధపడతారు. వృద్ధులు, చిన్న పిల్లలపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నడి వయస్కులపై ప్రభావం చూపదు.

అప్రమత్తంగా ఉంటూ లక్షణాలు కనిపించిన వెంటనే అర్హుడైన న్యూరో ఫిజీషియన్‌ను సంప్రదించి వైద్య చికిత్స పొందితే ఈ వ్యాధి నుంచి వెంటనే విముక్తి పొందుతారు. కాకినాడ జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలో అన్ని వసతులతో కూడిన వైద్య చికిత్స అందుబాటులో ఉంది.

- ఏపీలో మొత్తం 17 కేసులు నమోదు కాగా కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు వెలుగు చూశాయి.
- అతిగా ఇన్ఫెక్షన్లు, వ్యాక్సిన్లు, సర్జరీలు, ట్రామా, జన్యుపరంగానూ జీబీఎస్ వ్యాధి వచ్చే అవకాశముంది.
- ఇంట్రా వీనస్ ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్ చేయించుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తోంది.
- రాష్ట్రవ్యాప్తంగా 8వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామని, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్స అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

ప్రాణాంతకం కాదు



మన రోగ నిరోధక వ్యవస్థే మన నరాలు, కండరాలపై దాడి చేసి విచ్ఛిన్నం చేస్తుంది. జీబీఎస్ లక్ష మందిలో ఒకరికి మాత్రమే సోకే అత్యంత అరుదైన వ్యాధి. మనకు తెలియకుండానే మరణం అంచుల వరకు వెళ్లి వస్తాం. ప్రాణాంతకం కాదు.

డాక్టర్ ఎండీ షరీఫ్
న్యూరో మెడిసిన్ విభాగ ఇన్‌చార్జి, కాకినాడ జీజీహెచ్

క్రీడా సంబరానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43 జట్లు
- వెయ్యిమంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు
- ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మెరిసిపోతున్న ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ కోర్టు
- క్రీడాకారులతో నిండిపోయిన కాకినాడలో హోటళ్లు
- నేటి నుంచి 28వ తేదీ వరకు క్రీడాపోటీలు
- అతిథులుగా వస్తున్న అర్జున, ఖేల్ రత్న అవార్డు గ్రహీతలు



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కాకినాడలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలను రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం సహాయ సహకారాలను అందిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. ఈటోర్నమెంట్ ప్రారంభ వేడుకలు శనివారం సాయంత్రం 4గంటకు డీఎస్ఏ మైదానంలో జరుగుతాయి. ఈవేడుకలకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అర్జున, ఖేల్‌రత్న అవార్డు గ్రహీతలు అతిథులుగా హాజరుకానున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డులు నుంచి పురుష, మహిళల టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. సుమారు 1000 మంది క్రీడాకారులు, 100మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలలో పాల్గొననుండగా, శుక్రవారం సాయంత్రా నికి దాదాపు 650 మంది కాకినాడ చేరుకున్నారు. ఆతిథ్యం ఇస్తున్న మనరాష్ట్రం నుంచి పురుషులు, మహిళల జట్లు ఈపోటీలో పాల్గొంటున్నాయి. వీరందరికీ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీలు రైలు, బస్‌స్టేషన్లు, విమానాశ్రయాలు వద్దే స్వాగతం పలికి ప్రత్యేక బస్సులలో వారికి కాకినాడ నగరంలోని వివిధ హోటళ్లు, అతిథి గృహాల్లో బస ఏర్పాటు చేశారు. కాకినాడ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించారు. ఈ టోర్నమెంట్‌ను అపూర్వరీతిలో నిర్వహించేందుకు జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా జేసీ రాహుల్‌మీనాలు గడిచిన వారంరోజులుగా ఏర్పాట్లను నిత్యం స్వయం గా పర్యవేక్షిస్తూ, అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో 14 అం శాల వారీ ఏర్పాటుచేసిన కమిటీలు యుద్ధప్రా తిపదికన పనులు పూర్తి చేశాయి.

పోటీలో 43 జట్లు

దేశంలో ఉన్న 18రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 43జట్లు పాల్గొంటు న్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల నుంచి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కన్వీనర్‌గా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్ సభ్యులుగా ఉన్నారు. టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్‌గా డీఎస్‌డీవో శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. మ్యాచ్‌లు వీక్షించే ప్రేక్షకులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి

వైభవంగా భీమేశ్వరుడి పుష్పోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవంలో ఆఖరి అంకమైన శ్రీపుష్పోత్సవం శుక్రవారంరాత్రి వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై ఉన్న పీఠంపై ఉంచి పుష్పాలతో అలంకరించారు. ఈకార్యక్రమం కోసం మాణిక్యాంబ అమ్మవారిని రకరకాల పూలు, పండ్లతో అలంకరించారు. భక్తులు తెచ్చిన స్వీట్లను పూజా మందిరంలో ఉంచారు. పూజా కార్యక్ర మం అనంతరం తొలి దంపత తాంబూలాన్ని దేవస్థానం బ్రహ్మ బ్రహ్మశ్రీ దేవుల పల్లి ఫణిరామకృష్ణ దంపతులకు అంద జేశారు. ఈ పుష్పోత్సవం తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. హాజరైన భక్తులకు కొబ్బరి బొండాం, జాకెట్ ముక్క, దంపత తాంబూ లంగా అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో శయనింపచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దుర్గాభవాని పర్యవే క్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్నవరం దేవస్థానం రత్న, సత్యగిరి చుట్టూ

భూ సర్వే ప్రక్రియ ప్రారంభం

- వారంరోజులపాటు కొనసాగనున్న సర్వే

అన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంకు సంబంధించి రత్న, సత్యగిరిల చుట్టూ ఉన్న స్థలాలు, భూములపై శుక్రవారం నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభించారు. రావోర్ సర్వే ద్వారా త్వరితగతిన పని పూర్తవుతుందని భావించి ఈ విధానాన్ని ప్రారంభించారు. తొలిరోజు దేవస్థానం కళాశాల వెనుకభాగంలో చేపట్టగా అక్కడక్కడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి మార్కింగ్ వేశారు. దేవస్థానం సత్యరత్నగిరిల చుట్టూ ఆక్రమణలపై ఇప్పటికే చాలాసార్లు సర్వే చేపట్టి పూర్తికాకుండా మధ్యలో వదిలేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ సర్వే అయినా పూర్తిగా చేపడతారా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మధ్యలోనే నిలుపుదల చేస్తారా అనేది వేచిచూడాలి. ప్రస్తుతం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు రెవెన్యూ నుంచి రావడంతో వీటిపై పూర్తి అవగాహన ఉండడంతో సర్వే అంతా పూర్తిచేయాలని ఆశించాలి. వారంరోజులపాటు సర్వే ఉంటుందని దేవస్థానం లీజుల విభాగ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో లీజుల విభాగ ఏఈవో బీఎన్ రెడ్డి, సూపరింటెండెంట్ పి.వి.రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్, మండల సర్వేయర్ రాజు తదితరులు ఉన్నారు.



దేవస్థానం భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు, దేవస్థానం సిబ్బంది

'రూసా' పరిశోధనా ప్రాజెక్టులపై వీసీ సమీక్ష



వర్శిటీ అధికారులతో సమీక్షిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద వర్శిటీలో చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులపై జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శుక్రవారం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రూసా పరిశోధనా ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి వీసీ తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా 9 పరిశోధనా ప్రాజెక్టులకు రూ.93లక్షలు రూసా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రెండేళ్ల పాటూ చేపట్టనున్న ఈ పరిశోధనా ప్రాజెక్టులకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లు ప్రాజెక్టు ఫెలోను త్వరితగతిన నియమించుకోవడంతో పాటూ పరిశోధనలకు అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. 9 పరిశోధనా ప్రాజెక్టులకు సంబంధించినజర్నల్స్‌ను ప్రచురితమయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమీక్షకు రూసా సమన్వయకర్త, వైస్ ప్రిన్సిపాల్ ఎం. స్వరూపారాణి అధ్యక్షత వహించగా, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, వి.శ్రీనివాసులు, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు

తమిళనాడు యువకుడి సైకిల్ యాత్ర

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ విదేశాలలో మొక్కలు నాటుతూ ఆక్సిజన్ శాతాన్ని వాతావరణంలో పెంపొందించేందుకు తమిళనాడుకు చెందిన యువకుడు ముత్తు సెల్వాన్ పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్‌పై యాత్ర చేపట్టాడు. 32,200 కిలోమీటర్ల దూరాన్ని 1111 రోజుల్లో ప్రయాణించి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సైకిల్‌పై సాహసయాత్ర చేపట్టాడు. 2021 డిసెంబరు 28న సైకిల్‌యాత్రను ప్రారంభించిన సెల్వాన్ శుక్రవారం జిల్లాలోని ఆత్రేయపురం చేరుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన సెల్వాన్ ఈ సాహసయాత్ర చేపట్టాడు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సెల్వాన్ కలిసి తన సైకిల్‌యాత్ర కోసం వివరించాడు. భారత దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాలలో సైకిల్ యాత్ర ద్వారా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెల్వాన్‌ను ఎమ్మెల్యే సత్యానందరావు, ఆయన తనయుడు సంజీవ్ దుశ్శాలువాతో సత్కరించి ఆర్థిక సాయం అందజేశారు.



సైకిల్ యాత్ర చేస్తున్న సెల్వాన్‌ను సత్కరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యార్థిపై కోడికత్తితో దాడి

- కరప మండలం యండమూరులో ఘటన
- తారాజువ్వల కాల్చివేత విషయంలో గొడవ...
- పోలీస్ పికెట్ ఏర్పాటు


దాడిలో తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావు

కరప, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం యండమూరులో గురువారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తారాజువ్వల విషయంలో తలెత్తిన వివాదం చినిచినికి గాలివానలా మారింది. ఒక విద్యార్థిపై కొంతమంది యువకులు కోడి కత్తితో దాడిచేసి తీవ్ర సంచలనం సృష్టించారు. కరప పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం. యండమూరుకి చెందిన కురుపూడి ఈశ్వరప్రసాద్ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8వ తేదీన స్థానిక మీసాల వెంకన్నకల్యాణ ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథం ఊరేగింపులో ఈశ్వరప్రసాద్, అతని స్నేహితులు తారాజువ్వలు వేయగా, అదే గ్రామానికి చెందిన మారెళ్ల అజయ్, గుబ్బల కాలేబు, జిజేల్ అనే యువకులు వారి వద్దకు వెళ్లి కావాలనే తమపై తారాజువ్వలు వదిలినట్టు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగి, మీ అంతు చూస్తామంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. తిరిగి మళ్లీ 13వ తేదీన కాలేజీలో ఉన్న ఈశ్వరప్రసాద్‌కు మారెళ్ల అజయ్ ఫోన్ చేసి సాయంత్రం ఇంటికి రాగానే వెంకన్నబాబు గుడి వద్దకు చేరుకోవాలని చెప్పాడు. దీంతో భయపడిన ఈశ్వరప్రసాద్ గ్రామానికి చెందిన గుబ్బల సాయి, పితాని శేఖర్‌ను వెంటబెట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. అజయ్ వద్దకు ఈశ్వరప్రసాద్ వెళ్లి మాట్లాడుతుండగా కాలర్ పట్టుకుని కిందకు తోసేశాడు. అక్కడే ఉన్న అజయ్ స్నేహితులు కాలేబు, విజయ్, వినోద్, అనిల్, మనోహర్, లచ్చన్న కిందపడ్డ ఈశ్వరప్రసాద్‌ను కదలకుండా గట్టిగా పట్టుకోవడంతో అజయ్ చంపాలన్న ఉద్దేశంతో కోడికత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఈ దాడిలో ఈశ్వరప్రసాద్ తల, ఎడమ, కుడి పక్కన నుదిటిమీద, ఎడమ భుజం, కుడి చాతిపైన తీవ్ర గాయాలయ్యాయి. దీంతో షాక్‌కు గురైన ఈశ్వరప్రసాద్ స్నేహితులు సాయి, శేఖర్, అదే సమయంలో అటుగా వెళ్తున్న వెంకటేష్, దుర్గాప్రసాద్, సాయికృష్ణ అజయ్ మిత్రబృందం నుంచి కాపాడి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలోని రెండువర్గాల మధ్య తీవ్ర దుమారం రేగింది. విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, గొల్లపాలెం, కోరంగి, తిమ్మాపురం, ఇంద్రపాలెం ఎస్ఐలు తోట సునీత, రామారావు, సత్యనారాయణరెడ్డి, మోహన్‌కుమార్, వీరబాబు, రవీంద్ర, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. దాడిలో ఉపయోగించిన కోడికత్తి, ఇతర ఆధారాలను సేకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు, అతని మిత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్ఐ సునీత తెలిపారు.


ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ సునీత, పోలీస్ సిబ్బంది

45 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు


రమణక్కపేట ఉన్నత పాఠశాల సమీపంలో బియ్యం లోడుతో ఉన్న వ్యాన్

కొత్తపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 45 టన్నుల రేషన్ బియ్యాన్ని కాకినాడ జిల్లా కొత్తపల్లి ఎస్ఐ జి. వెంకటేష్ పట్టుకొన్నారు. శుక్రవారం తన సిబ్బందితో రమణక్కపేటకు వెళుతుండగా, ఊరుచివర ఉన్న జడ్పీ హైస్కూల్ వద్ద ఓ వ్యాన్‌ను గుర్తించారు. అను మానం వచ్చి దాన్ని పరిశీలించగా రేషన్‌బియ్యం ఉన్నాయి. దీన్ని గుర్తించి తహసీల్దార్ జి. చిన్నారావుకు సమాచారమిచ్చారు. దీంతో సామర్లకోట సివిల్‌సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కమల వెళ్లి స్వాధీనపర్చుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన వీ. లక్ష్మణ్ అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. బియ్యాన్ని పిఠాపురం సివిల్ సప్లయిస్ పాయింట్‌కు తరలించారు. లక్ష్మణ్‌పై 6ఏ కేసుతో పాటు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ కమల చెప్పారు.

పొలంలో ఎరువు వేస్తూ ...

అస్వస్థతకు గురై యువ రైతు మృతి


మోర్త నాని (ఫైల్)

కె.గంగవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో ఎరువులు, గుళికలు వేస్తూ అస్వస్థతకు గురై ఓ యువరైతు మృతిచెందాడు. కోనసీమ జిల్లా పామర్రులో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్‌కే జానీ బాషా తెలిపిన వివరాలివి. పానింగపల్లికి చెందిన మోర్త నాని (28) అనే యువ రైతు తను చేస్తున్న కౌలు పొలంలో ఎరువులు వేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అయితే ఉదయం వెళ్లిన నాని ఎంతకూ రాకపోవడంతో తండ్రి ఆనందరావు పొలం దగ్గరకు వెళ్లి చూసేసరికి అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. తొలుత అతన్ని పామర్రు ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం రామచంద్రపురం తరలించారు. ఈలోగా ఆసుపత్రికి చేరే సరికే మృతిచెందాడు. నాని తండ్రి ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై కేసు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి, తప్పుడు పట్టాలను టాంపరింగ్‌కు పాల్పడిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై పెద్దాపురం పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేసినట్టు శుక్రవారం పెద్దాపురం పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే గత ఏడాదిలో జరిగిన ఈ అక్రమ ఫోర్జరీ, ట్యాంపరింగ్ వ్యవహారంపై పెద్దాపురం కౌన్సిల్‌లో పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన విషయం పాఠకులకు విధితమే. ప్రభుత్వ పోరంబోకు పుంతభూమికి ఫోర్జరీ పట్టాలు రూపొందించి ఎస్టీలకు అక్రమంగా రూ. 1.30 లక్షలకు విక్రయించిన సంఘటనపై అప్పట్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దాపురం ఆర్డీవో జేఎస్ రామారావుకు ఫిర్యాదు చేయగా, తహశీల్దార్ వెంకటలక్ష్మిని విచారణ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో విచారణ జరిపిన అనంతరం పట్టాలు ఫోర్జరీ చేసినట్టుగా తహశీల్దార్ గుర్తించారు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం ఆర్డీవోకు నివేదికలు సమర్పించారు.

ఈ మేరకు రెవెన్యూ అధికారుల ఆదేశాలతో పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఫోర్జరీ, ట్యాంపరింగ్, అక్రమ విక్రయాలు, చీటింగ్ నేరాలకు సంబంధించి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు, ఇద్దరు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి మృతి


పోలీసులు గుర్తించిన మృతదేహం

తుని రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. డీమార్ట్ వెనుక మూసివేసి ఉన్న గేటు వద్ద సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈయనకి సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసుల నెంబర్ 9490619020కు కాల్ చేయాలన్నారు.

లక్ష్మీదేవిపేటలో 48 ఇళ్లు కూల్చివేత

- పట్టాభూమిలో నిర్మించడంతో కలెక్టర్ ఆదేశాలతో చర్యలు


జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఎటపాక, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట రెవెన్యూ గ్రామ పరిధి పట్టాభూమిలో నిర్మించుకున్న 48 ఇళ్లను శుక్రవారం తెల్లవారు జామున రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేశారు. జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాలతో కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆపరేషన్‌లో భాగంగా తెల్లవారు జామున ఎటపాక తహశీల్దార్ కారం సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, విలీన మండలాల్లోని పోలీసు అధికారులు బలగాలతో లక్ష్మీదేవిపేటలోని ఇళ్ల వద్దకు జేసీబీతో చేరుకున్నారు. ఇళ్లల్లోని సామగ్రిని బయటకు తీసి, పోలీసు బలగాల నడుమ జేసీబీలతో ఇళ్లన్నీ కూల్చివేశారు. తాటాకు ఇళ్లతో పాటు రేకులతో నిర్మించిన మెత్తం 48 ఇళ్లను నేలమట్టం చేశారు. అయితే రాష్ట్ర సరిహద్దులో ఉన్న 2 ఎకరాల 25 సెంట్ల భూమిలో నాలుగైదు ఏళ్ల క్రితం అల్లూరి జిల్లాలోని కూనవరం, వరరామచంద్రపురం, చింతూరుతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన గిరిజనులు ఇక్కడ ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారు. ఇటీవల ఈ భూమి గల యజమాని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు తన పట్టా భూమిని ఆక్రమించి, ఇళ్లు నిర్మించుకున్నారని ఫిర్యాదుచేశాడు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేశారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని, ఉన్న పళంగా కూల్చితే ఎక్కడకి వెళ్లాలంటూ బాధితులు వాపోయారు. కూల్చివేతల అనంతరం కొందరు బాధితులతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. ఎటపాకలో ప్రభుత్వ స్థలాన్ని సర్వేచేసి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తహశీల్దార్ సుబ్బారావుకు ప్రభుత్వ స్థలాల సర్వే నిర్వహించి, నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా భూ పట్టా కలిగిన యజమాని 2023 సంవత్సరంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించి, తనకు అనుకూల తీర్పును పొందారని తహశీల్దార్ వెల్లడించారు. కాగా ఈ ఇళ్ల కూల్చివేత ఆపరేషన్‌లో సుమారు 150 పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

పెనుగుదురులో చోరీ

బంగారం, వెండి ఆభరణాల అపహరణ

కరప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరపమండలం పెనుగుదురులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.60 వేలు విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు గ్రామానికి చెందిన పబ్బినీడి అప్పారావు ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పాయకరావుపేట మండలం సచ్చివరం గ్రామంలోని బంధువుల ఇంటికి భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి 12న ఇంటికి రాగా ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా 8గ్రాములు ఉండే రెండు జతల బంగారు చెవిదిద్దులు, 550గ్రాముల అష్టలక్ష్మి వెండిచెంబు, 300గ్రాములున్న రెండు వెండిగిన్నెలు, 200గ్రాములున్న రెండు వెండి దీపం కుందెలు వెరసి మొత్తం రూ.60వేలు విలువచేసే ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై కరప పోలీసులకు ఫిర్యాదుచేయగా కాకినాడ నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

'పేరాబత్తుల'పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారని, అతడిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ దూరప్రాంతాల్లో ఉన్నవారికి బస్సు, రైలు టిక్కెట్లు బుక్ చేసేందుకు ఒక వాట్సాప్ నెంబరును రాజశేఖర్ వినియోగిస్తున్నారని, దానికి మెసేజ్ పెడితే స్పందించి ఓటరా కాదా అని నిర్ధారించుకున్నాక ట్రావెల్స్ సమాచారం అడిగి, టిక్కెట్ బుక్ చేసినట్టు మెసేజ్ పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు మెయిల్‌లో ఫిర్యాదు చేశానని, కాని స్పందన లేదన్నారు. ఎన్నికల సంఘం స్పందించి రాజశేఖరంను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగేశ్వరరావు(ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో శుక్రవారం విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఉండపల్లి నాగేశ్వరరావు(49) రొయ్యల చెరువు సాగుచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి మేత వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడిని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మేరకు భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8465 క్యూసెక్కులుగా ఉండగా, గోదావరి నీటి మట్టం 9.45 అడుగులుగా నమోదయింది

కుంతీమాధవుడి హుండీల లెక్కింపు



పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవ స్వామి దేవస్థానంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. ఏడాది కాలానికిగానూ రూ.2లక్షల71వేల495 ఆదాయం లభించింది. లెక్కింపులో ఆలయ ఈవో నున్న శ్రీరాములు, దేవదాయశాఖ సిబ్బంది, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భర్త కనిపించడం లేదని భార్య జరీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంల వెలమపేట గ్రామానికి చెందిన షేక్ సర్కార్(40) గ్రామాల్లో తిరుగుతూ పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటాడు. గత ఏడాది మార్చిలో జరీనా మస్కట్ వెళ్లింది. ఆమె వెళ్లిన పది రోజులకు సర్కార్ వ్యాపారం నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. ఇటీవల మస్కట్ నుంచి తిరిగి వచ్చి జరీనకు భర్త కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు

నరసన్న ఆదాయం రూ.47,89,784


హుండీలో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం దేవస్థానంలో హుండీలను లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,76,268, గుర్రాలక్కమ్మ హుండీ ఆదాయం రూ.82,241, అన్నదాన హుండీ ఆదాయం రూ. 27,275 వెరసిరూ.47,89,784 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజులకుగాను స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా 8.500 మి.గ్రా. బంగారం, 104.370 మి.గ్రా. వెండి, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.47, 587 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. కార్యక్రమంలో డీసీ డీఎల్వీ రమేష్‌బాబు, చైర్మన్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాల రాజాబహదూర్, ఉత్సవ సేవాకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఎంపీటీసీ భైరా నాగరాజు, తనిఖీ అధికారి జె. రామలింగేశ్వరరావు, విశ్రాంత ఈవో బి.వెంకటేశ్వరరావు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజుల హుండీలు లెక్కించిన అధికారులు

20 నుంచి జాతీయస్థాయి యువజనోత్సవాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 20, 21, 22 తేదీల్లో ఉద్భవ్ - 2025 పేరుతో జాతీయస్థాయి యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లోని వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాలను కూడా భాగం చేశామని, విద్యార్థులతో వ్యాపార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఆహారం, ఆటలు, ఫ్యాషన్ తదితర స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రహదారిపై వాహనాలు నడిపేవారంతా తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఏకేసీ కళాశాల రోటరీహాలులో బీమా క్లెయిమ్స్ పట్ల వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025లో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించడం ఎంత ముఖ్యమో బీమా చేయించుకోవడం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వల్ల అసంఘటితరంగ కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయన్, కె.చైతన్య సుమ, జి.రాధికా దేవి, వీవీవీ సాయికుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వల్లి, కార్మికశాఖ అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గతంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన అప్పారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. 2023-24లో రఘుదేవపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అప్పారావు పంచాయతీ నిధులు రూ.15 లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదులు అందడంతో అతడిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. సస్పెండ్ అయిన అప్పారావు ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారని ఈవోపీఆర్డీ పేర్కొన్నారు.

మార్చి 14న రాజమహేంద్రవరంలో

ప్రభుత్వ ఉద్యోగుల నగర మహాసభ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా మార్చి 14న రాజమహేంద్రవరం నగర మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ కోరారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో సంఘం నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దనున్న చందాసత్రంలో రాజమహేంద్రవరం నగర మహాసభ జరుగుతుందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకునేలా సంఘం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగుల సభలను జరుపుతున్నామని పేర్కొన్నారు. సభ విజయవంతానికి నగర, జిల్లా కమిటీలు సంయుక్తంగా పనిచేయాలని ప్రసాద్ వర్మ కోరారు. నగర అధ్యక్షుడు జీబీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, నగర కార్యదర్శి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా


రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో కొత్త నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు నిలిపివేయాలని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమని అన్నారు. యూనియన్ నాయకులు శేషుకుమార్, పాపారావు మాట్లాడుతూ ఐదు రోజుల పనిదినాలు అమలు పర్చాలని, ఉద్యోగులకు ఇచ్చే సంక్షేమ ప్రయోజనాలపై ఇన్ కం ట్యాక్సు మినహాయింపు ఇవ్వాలని అన్నారు. మార్చి 3న పార్లమెంట్ నెదుట ధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శ్రీనివాస్, మురళీధర్, అప్పారావు, శేఖర్, స్వాతి, కీర్తన, సోమరాజు, రమేష్, వెంకటేశ్వరావు, ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

సూట్‌కేస్ పోయిందని ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆవ రోడ్ అల్యూమినియం కాలనీకి చెందిన వి.దుర్గ తాను శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తిరిగి వచ్చే సరికి ఇంటిలోని ఓ సూట్‌కేస్ కనబడడం లేదని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సూట్‌కేస్‌లో మూడు కాసుల బంగారు వస్తువులు, 250గ్రాముల వెండి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వ్యాపారులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు హెచ్చరించారు. పట్టణంలోని 11వవార్డులో పలువ్యాపార, దుకాణ సముదాయాలను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించి వ్యాపారులకు పలు సూచనలు చేశారు.

అమర జవాన్లకు నివాళులర్పిస్తూ శాంతి ర్యాలీ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్ర దాడిలో అమరులైన వీర జవాన్లకు నివాళులర్పిస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అమలాపురం శాఖ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు శుక్రవారం అమలాపురం పట్టణ వీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేయాలి

ఎమ్మెల్యే ఆనందరావుకు వినతి



ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేస్తోన్న వివిధ విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు శుక్రవారం టీడీపీ క్యాంపు కార్యాలయంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కలిసి అర్జీ అందించారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, మినిమం టైమ్ స్కేలు, హెచ్ఆర్ఏ వేతనాలు పెంచాలని, ప్రస్తుతం ఉన్న పార్టుటైమ్ విధానాన్ని రద్దుచేసి ఫుల్‌టైమ్ ఒకేషనల్ టీచర్‌గా మార్చి వేతనాలు పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసును 62ఏళ్లకు పెంచడంతో పాటు మహిళా ఉద్యోగులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నూకపెయ్యి గంగాధరరావు, బత్తుల శ్రీను, మెండు శ్రీను, తంగెళ్ల శ్రీను, గూటం నాగన్న, పోలిశెట్టి చంద్రకుమార్, ఆర్.రమాదేవి, పండు మురళీ, జె.నాగలక్ష్మి, రెహ్మాన్, జనిపల్లి అశోక్‌బాబు, నెల్లి వెంకట్రావు, నేదునూరి త్రినాథ్, బొంతు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య జయంతి

పలు చోట్ల సంజీవయ్యకు ఘన నివాళి



అమలాపురం: గడియార స్తంభం సెంటర్‌లో సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. సుభాషిణి ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్రతో పాటు పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్యుడిగా ఎదిగారని, ఆరు లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన సామ్యవాదిగా వక్తలు కొనియాడారు. కాపు సామాజికవర్గానికి రిజర్వేషన్లు కల్పించిన ప్రజాస్వామ్యవాదిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వంటెద్దు బాబి, పేరి శర్మ, జోగి అర్జునరావు, మహబూబ్ షకీల, వస్కా బాబు, మొల్లేటి వెంకటేశ్వరరావు, పులుసుగంటి ప్రకాష్, ఈతకోట సోమరాజు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు కాపాడిన సంజీవయ్య

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య 104వ జయంతిని ముమ్మిడివరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ విలువలను కాపాడిన వ్యక్తి సంజీవయ్య అన్నారు. కార్యక్రమంలో ముషిణి శివప్రసాద్, గోడి భాస్కరరావు, గుబ్బల రవి, ఎంటీ ప్రసాద్, మెల్లం శ్రీరాములు, మెండి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు నివాళి

అంబాజీపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను జిల్లా మౌలిక వసతుల సాధన కమిటీ కన్వీనర్ ఎన్ఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంజీవయ్య పేరుపై కాలనీ ఏర్పాటు

అంతర్వేది, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం సంజీవ కాలనీలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. తొలుత సంజీవయ్య విగ్రహానికి నివాళులర్పించారు. సంజీవయ్య చేసిన సేవలను పలువురు కొనియాడారు. దళితముఖ్యమంత్రి పేరుపై సంజీవయ్య కాలనీ ఏర్పడడానికి ఆయన పేదలకు చేసిన సేవలే కారణమని కొనియాడారు. కాలనీసంఘ ప్రెసిడెంట్ కె.రాజీవ్‌భూషణ్, జె.కుమారత్నం, బి.రాజ్‌కుమార్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషిచేయాలి



అయినవిల్లిలో రాజశేఖర్ విజయాన్ని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరపున పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. శుక్రవారం అమలాపురం పట్టణ పరిధిలోని 19, 20, 21, 22 వార్డుల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లోని పట్టభద్రులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గ పరిశీలకుడు పెచ్చెట్టి బాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను, కంచిపల్లి అబ్బులు, పిండి రాజా, టీడీపీ తెలుగు మహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, తిక్కిరెడ్డి నేతాజీ, అధికారి జయవెంకటలక్ష్మి, వలవల శివరావు, భాస్కర్ల రామకృష్ణ, ఎండీ బషీర్, కుంచే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో ప్రచారం

అయినవిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పట్టభద్రులను కోరారు. శుక్రవారం అయినవిల్లి, తొత్తరమూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎమ్మెల్సీ డి.విజయరామారావు, టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, నామన రాంబాబు, హెచ్ఆర్డీ సభ్యులు నేదునూరి వీర్రాజు, కాకర శ్రీనివాస్, వారా లక్ష్మీనరసింహరామ్, మోత వెంకటేశ్వరరావు, బడుడు భాస్కరజోగేష్, కడలి వెంకటసత్యనారాయణ, దంగేటి వెంకటరమణ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కళ్లేపల్లి సుబ్బరాజు, వేటుకూరి రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యానాం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించండి



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకుల ఆందోళన

యానాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గ అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వైద్యలింగం కోరారు. యానాం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దవులూరి కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కాటంశెట్టి రామ్మూర్తికి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈసందర్భంగా రామూర్తి గజమాలతోకాంగ్రెస్ నాయకులను సత్కరించారు. అనంతరం ఎంపీ వైద్యలింగం, మాజీ సీఎం నారాయణసామి మాట్లాడారు. ఈసందర్భంగా యానాం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట విద్యుత్ చార్జీలు పెంపునకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వైద్యనాథన్, మాజీ మంత్రి పెదపెరుమాల్, మాజీ ఎమ్మెల్యే కార్తీకేయన్, యానాం కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దినేష్, చెక్కల అరుణ్‌కుమార్, శ్రీమంతులు శ్రీధర్, కోన సూరిబాబు, ప్రవీణ్, వీరబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై కలెక్టర్‌తో భేటీ



యానాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రజలకు తాగు, రైతులకు సాగు నీటి ఎద్దడిపై పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ షన్మోహన్‌ను కలిశారు. యానాంలో నీటి ఎద్దడి అంశాలను వివరించారు. కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి జిల్లా ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేశారు. మల్లాడి తాళ్లరేవులోని ఇరిగేషన్ అధికారిణితో చర్చించారు. యానానికి నీటి వంతు ప్రత్యేకంగా ఇచ్చేందుకు కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆ విధంగా చర్యలు తీసుకుకోవాలని మల్లాడి కోరారు.

భరతమాత పూజోత్సవం



గడియార స్తంభం సెంటర్‌లో మాజీ సైనికులతో పాటు ప్రముఖులను సత్కరించిన సంస్కారభారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సంస్కార భారతి జిల్లాశాఖ, ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం గడియారస్తంభం సెంటర్‌లో భరతమాత పూజోత్సవం, భరతముని జయంతి నిర్వహించారు. సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ కృష్ణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ పుల్వామా దాడి నేపథ్యాన్ని వివరించారు. పుల్వామా దాడిలో అమరులైన వీరజవాన్లకు ఘన నివాళులర్పించారు. సైనికుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతూ ప్రదర్శన జరిపారు. మాజీ సైనికులను జేసీఐ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్కార భారతి జిల్లాశాఖ అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమర్, ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్, గోటేటి గంగాధరరావు, శ్రీగిరి పద్మావతి, యర్రమిల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు. భరతమాత పూజోత్సవంలో భాగంగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆజాద్ ఫౌండేషన్, ఎఫ్-3 ఫౌండేషన్, గంగాధర్ ఫ్రెండ్ సర్కిల్, జేసీఐ, కోనసీమ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్, మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్, స్నేహిత ఫౌండేషన్, శ్రీరామానంద చారిటబుల్ ట్రస్టు, కోనసీమ ఆహార నిధి, శ్రీవాసవి క్లబ్, వివేకానంద సేవాసమితి, గోదావరి ఆర్ట్ అకాడమీ ప్రతినిధులను సత్కరించారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజేతలకు అభినందన



రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజేతలను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాకినాడలో మూడు రోజులు జరిగిన రాష్ట్ర సెమినార్ కమ్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు, షీల్డులు సాధించగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా శుక్రవారం అభినందించారు. రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు రాష్ట్రస్థాయిలో సెమినార్, స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈపోటీల్లో అథ్లెటిక్స్‌లోని పలు విభాగాలతో పాటు బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్ పోటీల్లో కోనసీమ జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు అద్భుత ఫలితాలను సాధించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచినవ్యాయామ ఉపాధ్యాయులు తోట రవి, కామన మధు, మల్లాడి సురేష్, కొల్లి సతీష్, ఏ.ఐశ్వర్య, వాకపల్లి నాగదుర్గ, అందే సూర్యకుమారి, వి.నరసింహారావును డీఈవో అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్, కోశాధికారి ఎం.రామారావు, హెడ్ క్వార్టర్ కార్యదర్శి కె.ఈశ్వరరావు, బీవీఎస్ఎన్ మూర్తి, అమలాపురం జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, కామన గణేష్, ఉండ్రు ముసలయ్య, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు పాల్గొని క్రీడా విజేతలను అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. బండారులంకకు చెందిన చింతా యేసురత్నం(25) చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. దీంతో మానేపల్లిలోని బంధువు పిచ్చుక చంద్రసత్యనారాయణమూర్తి వద్ద ఉం టున్నాడు. కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న ఈనెల12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 12మందికి జరిమానా

అల్లవరం,ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి):మద్యం సేవించి వాహనాలు నడుపుతూపోలీసులకు పట్టుబడ్డ 12మందికి అమలాపురం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రూ.11వేల చొప్పున రూ.1.32లక్షలు జరిమానా విధించారని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు. బ్రీత్ఎనలైజర్ ద్వారా పలువురు వాహనదారులను పరీక్షించగా 12మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు నిర్ధారించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులను విచారించిన మేజిస్ట్రేట్ 12మందికి రూ.1.32లక్షలు జరిమానా విధించారన్నారు.

లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సర్వే

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ముమ్మిడివరం మండలం గాడిలంక, ఐ.పోలవరం మండలం పాతఇంజరం, కాట్రేనికోన మండలం గెద్దనపల్లి గ్రామాల్లో ముమ్మిడివరం మండలం లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దివ్యాంగుల, బాల్య వివాహాల సర్వే నిర్వహించారు. ప్యానల్ లాయర్, పారా లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మాతా శిశుసంక్షేమశాఖ ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు 12మందిసభ్యులతో కూడిన బృందం శుక్రవారం ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి దివ్యాంగుల వివరాలు సేకరించి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లోని కళాశాలల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అమలాపురం మిరియం డిగ్రీ కళాశాల, జ్యోతి ఐటీఐ కళాశాలల్లో అధ్యాపకులను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని కోరారు. నిమ్మకాయల శేషు, శ్రీరామ్ పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాల వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలను రవాణాధికారి వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. రహదారి భద్రత విషయంలో కళాశాల యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలన్నారు. రహదారి భద్రతా నియమాలను విద్యార్థి దశ నుంచే ప్రారంభించాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ రవికుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. ఎన్జీవో సంస్థ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్స్ జ్యోతి, సురేష్, కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్, కళాశాల ప్రిన్సిపాల్, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో ఇమామ్ జయంత్యుత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ముస్లిం మతస్థుల ఆరాధ్య దైవం ఇమామ్ మెహదీ జయంత్యుత్సవాన్ని నగరం, మామిడికుదురు గ్రామాల్లో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. శుక్రవారం మామిడికుదురులోని బాషు పంజాలో ఉర్దూ కవి వికార్‌నగరి ఆధ్వర్యంలో మిలాద్ జరిగింది. పలువురు ఉర్దూ కవులు పాల్గొని తమ కవిత్వాల ద్వారా ఇమామ్ మెహదీ వృత్తాంతాన్ని వివరించారు. తమ కవిత్వాల ద్వారా భక్తులను ఉర్రూతలూగించారు. మిలాద్ అనంతరం జరిగిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు నివారించాలి

జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు



ఉత్తమ డ్రైవర్ సాయిని సత్కరిస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సభకు జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై డ్రైవర్లకు దిశానిర్దేశం చేశారు. డ్రైవర్లు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని, దురాలవాట్లకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. అనంతరం జిల్లాస్థాయిలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీడ్రైవర్లతో పాటు డిపోస్థాయిలో 12మంది డ్రైవర్లకుప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో అమలాపురం రావులపాలెం, రాజోలు డిపోలకు చెందిన 62మంది రక్తదానం చేశారు. రోటరీబ్లడ్ బ్యాంకు, రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అమలాపురం, రావులపాలెం, రాజోలు, డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణమూర్తి, జీజీవీ రమణ, పి.ధనమ్మ, రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కరరావు, ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.

రహదారి మార్గదర్శకాలు పాటించాలి

రాజోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడుపుతున్నప్పుడు రహదారి మార్గదర్శకాలను వాహనదారులు పాటించాలని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, తాటిపాకలో రాజోలు తాలూకా ఆటో డ్రైవర్లతో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవ కార్యక్రమం ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తాటిపాకలో రాజోలు తాలూకా ఆటో డ్రైవర్లకు రావులపాలెం, రాజోలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అధికారులు శ్రీనివాస్, షణ్ముఖ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రాజోలు ఎస్ఐ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించాలని, ప్రతీ ఒక్కరూ తోటి ప్రాణాలను కాపాడాలని, మరణాల సంఖ్య తగ్గించాలని సూచించారు. పోటీ పరీక్షలు, క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు, పద్మనాభం, డాక్టర్ దయాసాగర్, పీఆర్వో ఎన్.రాజు, రిటైర్డ్ ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, డాక్టర్ బోస్‌పాల్గొన్నారు.

రివర్‌సైడ్ స్కూలు విద్యార్థుల ఔదార్యం

అంతర్వేది, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మోరిపోడు రివర్‌సైడ్ స్కూలు విద్యార్థులు రూ.1,42,110 సేకరించారు. విజయవాడలోని అంధుల ఆశ్రమానికి విద్యార్థుల తరపున ప్రిన్సిపాల్ వై.కిశోర్‌బాబు, ఉపాధ్యాయ సిబ్బంది రూ.1,42,110 నగదును స్నేహ ఫౌండేషన్‌కు అందించారు.

మెయిన్ స్కూలులో కలపాలన్న ప్రతిపాదన విరమించుకోవాలి

మామిడికుదురు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి బాడవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3, 4, 5తరగతులు చదువుతోన్న విద్యార్థులను మెయిన్ ఎలిమెంటరీ స్కూలులో కలపాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలని స్థానికులు శుక్రవారం ఎంఈవో లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. మెయిన్ ఎలిమెంటరీ స్కూలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉందని, జాతీయ రహదారిపై ప్రయాణించి వెళ్లాల్సి వస్తుందని, అంతేకాకుండా స్కూలుకు వెళ్లే దారిలో బ్రాందీషాపులు ఉన్నాయన్నారు. ఆయా కారణాల వల్ల విద్యార్థులకు ప్రమాదం సంభవించే ఆస్కార ఉందని, అందువల్ల స్థానికంగా బాడవలో స్కూలులోనే ఆయా తరగతులను విలీనం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎంసీ చైర్మన్ తోరం నాగరాజు, వేగి లక్ష్మీనారాయణ, పోతుమూడి నానాజీ, ఎం.దేవి, జె.విజయలక్ష్మి ఉన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మామిడికుదురు, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఆదివారంఉచిత వ్యాస్క్యులర్ వైద్య శిబిరాన్ని శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినట్టు సేవాసంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు తెలిపారు. మొగలికుదురులో గల జగ్గన్నపేట శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10నుంచి 3గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. రూ.4500విలువైన కలర్ డాప్లర్, అల్ట్రాసౌండ్ పరీక్షలను ఉచితంగా చేస్తారన్నారు.

ఎలుకల నిర్మూలన చేపట్టండి

కాట్రేనికోన, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం ఉచితంగా బ్రోమోడియోలిన్ మందు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయాధికారి కె.ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు గ్రాముల మందును 2గ్రాముల నూనె, 96గ్రాముల నూకలతో ఎర తయారు చేసుకుని, చిన్న చిన్న పొట్లాలుగా కట్టుకుని ఎలుకల కన్నాల్లో ఉంచాలన్నారు. రైతు సేవాకేంద్రాల నుంచి మందును పొందవచ్చన్నారు. రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలు చేపడితే సత్ఫలితాలుంటాయన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యం

మలికిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు, వారిని పరీక్షలకు భయం లేకుండా మానసికంగా ఉత్సాహంగా ఉంచేందుకు ఏపీఏ ఇండియా (అడ్వాన్స్ సైకలాజికల్ అసోసియేషన్ ఇండియా) ఆధ్వర్యంలో విజయీభవ ప్రోగ్రాంను విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. కమిటీ కోశాధికారి తేజ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల ఒత్తిడిని ఎదుర్కొనే మెలకువలు, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలి

మలికిపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. మలికిపురం ఏఎఫ్‌డీటీసీ సెమినార్ హాలులో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు తీసుకోవాలని, సీటు బెల్టు, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయరాదన్నారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్సు లేనివారికి వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు కావాల్సిన వారు సారథి యాప్‌లో అప్లయి చేసుకోవచ్చునని చెప్పారు. ఎస్ఐ పి.సురేష్, ఏఎస్ఐ నరసింహారావు, ఎస్.రమేష్‌బాబు, పీడీకే ప్రసాద్, ఆనందమహనీ పాల్గొన్నారు.

భీమాబాయి జయంతి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాతృమూర్తి భీమాబాయి జయంతిని ముమ్మిడివరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలమ్మ చెరువుగట్టున జైబుద్ధ పార్కులో భీమాబాయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రముఖ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్‌కు జన్మనిచ్చిన మాతా భీమాబాయికి దేశంలోని దళిత, పీడిత, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎంతో రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, కాశి సిద్ధార్థకుమార్, కాశి సింహాద్రివర్య, గోడి భాస్కరరావు, పలివెల నరేష్, రేకాడి నూకరాజు, పోతాబత్తుల చిట్టిబాబు, గొల్లపల్లి గోపి, మట్టపర్తి వెంకటేశ్వరరావు, మెల్లం శ్రీరాములు, మెండి రాజశేఖర్, పలివెల నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు మారుస్తున్నారు. దీని కారణంగా శనివారం ఉదయం 10నుంచి రాత్రి 8గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. చెయ్యేరు, చెయ్యేరుఅగ్రహారం, పెనుమెల్ల, లక్ష్మీవాడ, బంటుమిల్లి, ఉప్పూడి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు నలుగురు విద్యార్థులు

మామిడికుదురు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు గత డిసెంబరు 8న నిర్వహించిన నేషనల్ మీన్స్ కమెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు మామిడికుదురు జడ్పీ పాఠశాల విద్యార్థులు నిట్టా పృథ్వీరాజ్, డి.షహవార్, మహ్మద్ సాజిత్‌అబ్బాస్, కొనుకు సిరివెన్నెల ఎంపికైనట్టు హెచ్ఎం సీహెచ్ నిరంజని తెలిపారు. వీరికి 8నుంచి 12వ తరగతి వరకు నెలకు రూ.వెయ్యి చొప్పున కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు అభినందించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 11మంది విద్యార్థుల ఎంపిక

అల్లవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు అల్లవరం మండలం నుంచి పదకొండు మంది విద్యార్థులు ఎంపికయ్యారని మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు తెలిపారు. కొమరగిరిపట్నం హైస్కూల్ నుంచి 9మంది, ఓడలరేవు నుంచి ఒక విద్యార్థిని, ఒక బాలుడు ఎంపికయ్యారన్నారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన ఒక్కో విద్యార్థికి రూ.లక్ష స్కాలర్‌షిప్, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనం ఇస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, మండల విద్యాధికారి కె.కిరణ్‌బాబు, మండల విద్యాధికారి-2 ఎస్.ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

జాతీయ ఉపకారవేతనాలకు ఎంపిక

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలో అయిదుగురు విద్యార్థులు 2024 ఎన్ఎంఎం ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. గొల్లవిల్లి హైస్కూల్‌కు చెందిన డి.లలితామణిప్రియ, ఎస్.రష్మిత, ఎన్.జెస్సిక, టి.చల్లపల్లి హైస్కూల్ విద్యార్థి జి.సన్నీ, పేరాయిచెరువు యూపీ పాఠశాల విద్యార్థి పి.వినోద్‌కుమార్ జాతీయ ఉపకారవేతనాలకు ఎంపికైనట్టు పాఠశాలలకు ఉత్తర్వులందాయి.

యానాంలో పుదుచ్చేరి ఎంపీ పర్యటన

యానాం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి లోక్‌సభ సభ్యుడు వి.వైద్యలింగం బృందం పర్యటించారు. ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి శుక్రవారం 9.45గంటలకు రాజమండ్రి చేరుకున్న ఎంపీ బృందం రోడ్డుమార్గన 11.30గంటలకు యానాం చేరుకున్నారు. యానాం స్థానిక పాతబస్టెండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ వైద్యలింగం, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యానాం రిసార్ట్స్‌కు చేరుకున్నారు. యానాం పరిపాలనాధికారి మునిస్వామి వారిని శాలువాలతో సత్కరించారు. యానానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. పరిపాలనాధికారి కార్యాలయ ప్రాంగణంలో శనివారం దిశపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం తిరిగి రాజమండ్రి చేరుకుని విమానంలో పుదుచ్చేరి వెళ్తారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

అంబాజీపేట, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ముక్కామల లాకుల సెంటర్‌లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు అమలాపురం ఆర్‌అండ్‌బీ జేఈ రమేష్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే నాలుగురోడ్ల జంక్షన్‌లో ప్రమాదాలను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రైతులంతా విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలి

మలికిపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులంతా ప్రభుత్వ పథకాల కోసం విశిష్ట గుర్తింపు నమోదు పొందాలని మండల వ్యవసాయాధికారి రాజేష్ అన్నారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలో 8వేల మంది పీఎం కిసాన్ రైతులు ఉన్నారని, ఇప్పటి వరకు 2వేల మంది రైతులకు రిజిస్ట్రేషన్ పూర్తయిందన్నారు. ప్రతీ రైతుకు గుర్తింపు సంఖ్య ముఖ్యమని, లేనిచో రైతులకు పీఎం కిసాన్ వంటి పథకాలు రావని ఆయన తెలిపారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి మాతృవియోగం

మలికిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మలికిపురం మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్ తల్లి అమరావతి మృతిచెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. పలువురు యుగంధర్‌ను పరామర్శించారు.

క్రాస్ బండ్ల ఏర్పాటుకు అధికారులు డ్రెయిన్ల పరిశీలన

అల్లవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాగునీటి ఎద్దడి రాకుండా డ్రెయిన్లలో క్రాస్ బండ్లు వేసేందుకు శుక్రవారం అధికారులు డ్రెయిన్లను పరిశీలించారు. తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఇరిగేషన్ ఏఈ రహమాన్, డ్రెయిన్స్ ఈఏ సునీత, వీఆర్వోలు బెండనార్త్, చుంచుల డ్రెయిన్‌తో పాటు పలు డ్రెయిన్లను పరిశీలించారు. డ్రెయిన్లలో క్రాస్ బండ్లు వేసేందుకు ఇరిగేషన్ శాఖ రెండు షటర్లు, డ్రెయిన్స్ శాఖ ఐదు పాయింట్లు గుర్తించినట్టు తహశీల్దార్ నరసింహం తెలిపారు. దాళ్వా సాగునీరు వృథాగా పోకుండా నీటి క్రమబద్ధీకరణకు ఉప్పునీరు ఎగదన్నకుండా క్రాస్‌బండ్లు వేస్తున్నామని తహశీల్దార్ అన్నారు.

సైన్స్ ల్యాబ్‌కు రూ.20వేలు సాయం అందజేత

అల్లవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావు పంతులు జడ్పీ హైస్కూలులో సైన్స్ అండ్ సోషల్ స్టడీస్, ల్యాబ్ ఏర్పాటుకు పూర్వపు విద్యార్థి మోసుగంటి వెంకటేశ్వరరావు రూ.20వేలు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు జీఎస్వీ రమణకు అందజేశారు. కడలి సాయిబాబు, బి.సురేష్, వై.ప్రభాకర్, సీహెచ్ నరసింహస్వామి పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.2.78 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. నేము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,78,049 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

గోవిందమాలధారుల దీక్షదారణ: వాడపల్లి ఆలయంలో గోవిందమాలధారులు శుక్రవారం స్వామివారి సన్నిధిలో గోవిందమాల ధారణ తీసుకున్నారు. వేకువజామునే మాల ధరించే భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి దేవస్థానం దుస్తులు, మాలలు, వసతి ఉచితంగా అందిస్తుంది. ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది సుమారు 50 మంది భక్తులు దీక్షను ప్రారంభించారు. అలాగే అర్ధమండల దీక్ష 21 రోజులకు సుమారు 50 మంది శుక్రవారం దీక్షను ప్రారంభించారు. ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దీక్షదారులకు నూతన వస్త్రాలను అందించారు. గోవిందనామస్మణతో దీక్షదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దింట్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

రావులపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రావులపాలెం భద్రమహంకాళమ్మ వుంత రోడ్డులో ఉన్న పెద్దింట్లమ్మ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు అజయశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా చండీహోమం, పూర్ణాహుతి జరిపి అష్టోత్తర సహస్రనామ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పెద్దింట్లమ్మ ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



అమర జవాన్‌లకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, అనంతకుమారి

పుల్వామా దాడి ఘటనలో మృతి చెందిన జవాన్లకు నివాళి

కొత్తపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లో ఫిబ్రవరి 14న సైనికులను తీసుకు వెళుతున్న వాహనాలపై ఆత్మాహుతి బాంబుదాడి ఘటనలో మృతి చెందిన జవాన్లకు శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సైనికుల త్యాగాలను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. కార్యక్రమంలో బండారు సంజీవ్, కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, షేక్ మీరాన్‌షరీఫ్, ముత్యాల బాబ్జి, నలాది చిన్ని, ముద్రగడ సుబ్బారావు, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో సాయి రోహిత్‌ను సత్కరిస్తున్న దృశ్యం

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థికి సన్మానం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థి పెండ్యాల సాయి రోహిత్‌ను శుక్రవారం కళాశాల అధ్యాపకులు సత్కరించారు. రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థల్లో డిగ్రీ చదువుతున్న సాయి రోహిత్ ఎన్‌సీసీ విద్యార్థి కాగా, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాడు. అరుదైన గౌరవం దక్కించుకున్న విద్యార్థిని శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థులు, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థిని తల్లిదం డ్రుల సమక్షంలో సత్కరిం చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు బి.సునీత్ శ్రీనాథ్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు కె.సుశీల, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ.అరుణోదయ కుమార్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



శివలలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు

జింక్ లోపంపై రైతులు శ్రద్ధపెట్టాలి

కె.గంగవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రబీ పంటలో జింకులోపం సమస్యపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నంద కిశోర్, అమలాపురం జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ రాజశేఖర్, ఏవో మనోహర్ అన్నారు. శుక్రవారం వారు మండలంలోని శివల, దంగేరు గ్రామాల్లో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో జింకు, పొటాష్ లోపం, కాండం తొలిచే పురుగు, ఉల్లికోడు ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. గుళికలు వేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చేతులకు గ్లౌజ్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి'



కె.గంగవరం: పామర్రు ఎన్నికల ప్రచార సభలో కరపత్రం చూపిస్తున్న కూటమి నాయకులు



ఆత్రేయపురం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కె.గంగవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు కూటమి నాయకులు కృషి చేయాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం పామర్రులోని ఫంక్షన్ హాలులో కూటమి నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్ని కృష్ణ అధ్యక్షతన జరిగింది. దీనికి మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు బహుమతిగా ఇవ్వాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గన్ని కృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ రాక్షసపాలన వల్ల ఇప్పుడు వారి పాపాలు పండుతున్నాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే విధానం తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి, మరివాడ సూరిబాబు, రావిపాటి వెంకట గణేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషితో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలిపించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాలవారీగా గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో బండారు సంజీవ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మద్దూరి సుబ్బారావు, ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం బండారు బుల్లి సత్యం కాపు కల్యాణ మండపంలో మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సత్యానందరావుతో పాటు జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో బండారు సంజీవ్, బూసి జయలక్ష్మి, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పేరాబత్తుల రాజశేఖర్ గెలుపునకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం విస్తృతస్థాయి సమావేశం జరిపారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీ గణేష్‌కుమార్, యువ నాయకుడు సంజీవ్ తదితరులతో పాటు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తున్న రాజశేఖర్‌కు మద్దతుగా ఆలమూరు మండలంలో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందిస్తున్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నాయకులు ప్రచారం చేశారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

రావులపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి తెలిపారు. ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాల ఫిర్యాదుదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక

కె.గంగవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు తెలిపారు. కె.గంగవరం ఉన్నత పాఠశాల నుంచి పలివెల మహాలక్ష్మి, నున్న వీరవేణి(దంగేరు), యనమదల జోత్స్న(దంగేరు), గొల్లపల్లి క్రాంతి(సుందరపల్లి), ఎం. గాడ్లీ యూస్లీ(పేకేరు యూపీ స్కూల్) నుంచి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి 9, 10, 11, 12 తరగతులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే రూ.12వేలు ఆర్థికసాయం ప్రభుత్వం నుంచి అందుతుందని వారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులు

రాయవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.సత్తిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వాసంశెట్టి కార్తీక్, మేడిశెట్టి కుసుమ ప్రియ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌కు ఎంపికైనట్టు చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గణిత ఉపాధ్యాయుడు శేషుబాబును, ఎంపికైన విద్యార్థులను ఎంఈవో వై.సూర్యనారాయణ, సర్పంచ్ వి.వెంకట్రావు, ఎంపీటీసీ వి.విజయ్‌కుమార్, టీడీపీ నాయకుడు రిమ్మలపూడి వేణుగోపాల దొర, జనసేన నేత జి.సత్యం, మాజీ సర్పంచ్ వి.రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఈతకోట జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం కేవీస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో పాఠశాలకు చెందిన లంకే దినేష్, అడగళ్ళ బిందులక్ష్మిప్రియ, షేక్ ఆయేషా, కోసూరి సుగుణ, సీహెచ్ లక్ష్మీ ప్రియ, వల్లపురెడ్డి దీపిక, యేపుగంటి సంజన, ప్రతిభ కనబరిచి కేంద్ర, ప్రభుత్వం ఇచ్చే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను వారికి తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులను ఎస్‌ఎంసీ చైర్మన్ పిప్పర రమేష్, వైస్ చైర్మన్ కె.నాగమణి, సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఉపసర్పంచ్ నాగార్జున, ఎంపీటీసీ సీతారత్నం, హరిబాబు తదితరులు అభినందించారు.

ఆకట్టుకున్న పెయ్యిదూడల ప్రదర్శన

ఆలమూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం నవాబుపేటలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో శుక్రవారం పెయ్యిదూడల అందాల పోటీలు నిర్వహించారు. ఆరునెలలోపు పెయ్యిదూడలను ఈ పోటీల్లో పాల్గొనేలా నిబంధన మేరకు ఈ పోటీలలో గెలుపొందిన వాటి యజమానులకు బహుమతులు అందించారు. లేగదూడల పెంపకం, చేపట్టాల్సిన చర్యపై రైతులకు పశువైద్యులు అవగాహన కల్పించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. బండారులంకకు చెందిన చింతా యేసురత్నం(25) చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయాడు. దీంతో మానేపల్లిలోని బంధువు వద్ద ఉంటున్నాడు. కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న ఈనెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగారావు

స్వచ్ఛ మండపేట సాధనే లక్ష్యం

మండపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మండపేట లక్ష్యసాధనకు ప్రజలంతా సహకరించాలని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దటంతోపాటు, తడిపొడిచెత్తను వేరుచేయటం, ప్లాస్టిక్ నిషేధం, కంపోస్టు తయారీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మెప్మా సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం జరిపారు. పట్టణంలో ఆక్రమణలు తొలగించాలని ఆయన మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. మండపేట-ఏడిద రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తామన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం రోజున లక్ష ఉత్పత్తుల లక్ష్యంగా కోటి ఆదాయం వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పట్టణంలో హోటళ్లను తనిఖీ చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రంగారావుతో పాటు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తి రాజు, మెప్మా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తపాలా కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల నిరసన

మండపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) తపాలా ఉద్యోగులకు సత్వరమే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈనెల 18వ తేదీ నుంచి 23 వరకు నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలపాలని నిర్ణయించినట్టు ఉద్యోగులు తెలిపారు. విజయవాడలో 25న జరిగే రాష్ట్రస్థాయి ధర్నాను విజయవంతం చేయాలని సంఘ నాయకుడు కొండపల్లి సూర్యనారాయణ, కె.ఈశ్వరరావు, ఎండీఎం షరీఫ్ కోరారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు జి.వెంకట్రావు, ప్రవీణ్, ప్రియదర్శన్, ఎం.మధుసూధన్‌రావు, కె.దుర్గా దేవి, కె.అనుష, ఎం.అనుష, కంబాల పవన్ సాయి, వీరభట్ల పవన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ బారినపడి భవిష్యత్ పాడు చేసుకోవద్దు

రావులపాలెం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ క్రైమ్ బారినపడి భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐ చంటి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఇటీవల సైబర్ క్రైమ్ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, యువత ఎక్కువగా వాటి బారిన పడుతున్నారని తెలిపారు. అత్యాసకు పోయి సైబర్ నేరాల్లో చిక్కుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్, కానిస్టేబుల్ ఎస్.రాజు, మహిళా పోలీస్ వి.లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ సుభాషిణి, సుమలత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పోలీసు అధికారి



సబ్ ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీటీఏవో రామనాథం

సబ్ ట్రెజరీని తనిఖీ చేసిన డీటీఏవో

రాయవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాయవరం సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా ట్రెజరీ అకౌంట్స్ ఆఫీసర్ (డీటీఏవో) బి.రామనాథం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సబ్ ట్రెజరీ కార్యాలయంలోని రికార్డులను ఆయన తనిఖీ చేశారు. సబ్ ట్రెజరీ పరిధిలో ఎంత మంది పెన్షనర్లు ఉన్నారు, వారంతా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించారా అనే విషయంపై ఆరా తీశారు. అనంతరం టీడీఏవోను సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీవో ఎన్ఎస్ఎన్ మూర్తి, సీసీ కె.శివకుమార్, సిబ్బంది ఉన్నారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకున్న నిర్మాత అల్లు అరవింద్ సతీమణి నిర్మల

భీమేశ్వరస్వామి ఆలయంలో అల్లు అరవింద్ సతీమణి పూజలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామిని నిర్మాత అల్లు అరవింద్ సతీమణి నిర్మల శుక్రవారం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. క్షేత్రం మహిమను తెలిపారు. అనంతరం స్వామి వారి దర్శనం చేయించారు.

అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్తగా బండారు



కొత్తపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జనసేన తరపున అమలాపురం పార్లమెంటరీ సమన్వయకర్తగా కొత్తపేట జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్‌ను నియమించారు. జనసేన రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ విజయానికి కృషి చేస్తానన్నారు.



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభాకరరావు

దామోదరం సంజీవయ్యకు నివాళి

మండపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) దివంగత దామోదరం సంజీవయ్య జయంతిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు నేతృత్వంలో శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిపారు. సంజీవయ్య చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. మండపేట మండలం ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో సంజీవయ్య జయంతి నిర్వహించారు. తొలుత సంజీవయ్య చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయలు నివాళులర్పించారు.



మండపేటలో మూతపడిన టాయిలెట్స్

మూతపడిన టాయిలెట్స్‌తో వ్యాపారుల ఇక్కట్లు

మండపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కలువపువ్వు సెంటర్‌లో వున్న టాయిలెట్స్ కి తాళం వేయటంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం చెంతనే వున్న దుకాణాల సముదాయం సుమారు 100 వరకు ఉంటాయి. వ్యాపారులు టాయిలెట్స్‌కు వెళ్లాలంటే వాటికి తాళ్లం వేసి ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ షాపింగ్‌లకు అద్దె రూపంలో లక్షలాది రూపాయల ఆదాయం వ్యాపారుల నుంచి సమకూరుతోంది. ఇప్పటికైనా మూతపడిన టాయిలెట్స్ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని జిల్లా రవాణాధికారి డి.శ్రీనివాసరావు అన్నారు. అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సభకు జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. దురాలవాట్లకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. అనంతరం జిల్లాస్థాయిలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీడ్రైవర్లతో పాటు డిపోస్థాయిలో 12 మంది డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 62 మంది రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంకు, రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అమలాపురం, రావులపాలెం, రాజోలు, డిపో మేనేజర్లు చల్లా సత్యనారాయణమూర్తి, జీజీవీ రమణ, పి.ధనమ్మ, రామచంద్రపురం డిపో మేనేజర్ భాస్కరరావు, ఎన్.వరహాలబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజేతలకు అభినందన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాకినాడలో మూడు రోజులు జరిగిన రాష్ట్ర సెమినార్ కమ్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు, షీల్డులు సాధించగా జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా శుక్రవారం అభినందించారు. రాష్ట్రంలోని 13ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన పీజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు రాష్ట్రస్థాయిలో సెమినార్, స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈపోటీల్లో అథ్లెటిక్స్‌లోని పలు విభాగాలతో పాటు బ్యాడ్మింటన్, క్రికెట్, బాస్కెట్‌బాల్ పోటీల్లో కోనసీమ జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు అద్భుత ఫలితాలను సాధించారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచినవ్యాయామ ఉపాధ్యాయులు తోట రవి, కామన మధు, మల్లాడి సురేష్, కొల్లి సతీష్, ఏ.ఐశ్వర్య, వాకపల్లి నాగదుర్గ, అందే సూర్యకుమారి, వి.నరసింహారావును డీఈవో అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్, కోశాధికారి ఎం.రామారావు, హెడ్ క్వార్టర్ కార్యదర్శి కె.ఈశ్వరరావు, బీవీఎస్ఎన్ మూర్తి, అమలాపురం జోన్ అధ్యక్షుడు వైఎస్వీ రమణారావు, కామన గణేష్, ఉండ్రు మునలయ్య, డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు క్రీడా విజేతలను అభినందించారు.



రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ విజేతలను అభినందిస్తున్న డీఈవో సలీంబాషా